# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-01-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్దే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణాలో ఒక వెయ్యి 365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ విడుదల చేసింది.**
4. **తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు పూర్తిస్థాయిలో కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.**

==========================

ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. విశాఖపట్టణంలో పర్యటించిన ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిన్న శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన సభలో నరేంద్రమోదీ మాట్లాడుతూ....ఆంధ్రప్రదేశ్ అవకాశాల గని అని, నిర్దేశించుకున్న లక్ష్యాల్ని సాధించే రాష్ట్రం అని తెలిపారు. రాష్ట్రంలో రైల్వేజోన్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో వ్యవసాయం, వ్యాపార కార్యకలాపాలు పెరుగుతాయని, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ,

వాయిస్ ..35.. సెకన్లు

--------------------------

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్దే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరిగిన సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా నిలుస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్ (32 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఖరీఫ్ పంటకాలానికి హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పూర్తిచేసి చివరి ఎకరా వరకూ నీరందించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో మంత్రి నిన్న అమరావతి నుండి దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, కాలువ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2వేల 6వందల 29 కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనుల పురోగతి, సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు వంటి అంశాలపై ఒక నివేదికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హంద్రీనీవా-చిత్రావతి బ్యాలెన్సింగ్ జలాశయం అనుసంధాన పనులపైనా మంత్రి ఈ సందర్భంగా చర్చించారు.

---------------------------

మే 1వ తేదీ నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మార్చి 31వ తేదీలోగా ఉద్యోగ ఖాళీల వివరాలను అందజేయవలసిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కొత్త నోటిఫికేషన్లు జారీ చేసి 8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలో 1,365 ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన గ్రూప్ -3 పరీక్ష ప్రిలిమినరీ కీని టీజీపీఎస్సీ నిన్న విడుదల చేసింది. ఈ కీపై ఈ నెల 12 వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అభ్యంతరాలు తెలుపవచ్చని అధికారులు తెలిపారు.

---------------------------

తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల వైకుంఠ ద్వార దర్శనం కోసం.. తిరుపతిలో 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగిందని ఈ ఘటన పై దర్యాప్తు చేస్తున్నామని కలెక్టర్ తెలియజేస్తూ,..

వాయిస్ ( 30 సెకన్లు)

తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో క్షతగాత్రుల వివరాలు, ఇతర సమాచారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 0877-2236007 నంబరును సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. కాగా ఈ మధ్యాహ్నం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతికి చేరుకొని రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించనున్నారని అధికారులు తెలిపారు.

మరోవైపు తోక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. తిరుపతి ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని, క్షతగాత్రులకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించాలి'అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు పూర్తిస్థాయిలో కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి నగరాలలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా అభివృద్ధి చేయాలన్నారు. కర్మాగారాలు, దుకాణలలో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ కార్డులు మంజూరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు.

--------------------------

భారత దేశాభివృద్ధికి విదేశాలలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు అందజేస్తున్న సేవలను స్మరించుకోవడం కోసం ఈ రోజు ప్రవాస భారతీయ దివస్ నిర్వహిస్తున్నారు. 1915వ సంవత్సరం జనవరి 9వ తేదీన మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2003వ సంవత్సరం నుండి ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రవాస భారతీయులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, ఆర్థికంగా, సామాజికంగా భారత దేశాభివృద్ధిలో వారు గణనీయంగా పాలు పంచుకునేలా చేయడం ప్రవాస భారతీయ దివస్ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఒడిసాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సును ప్రారంభిస్తారు. ఒడిసా ప్రభుత్వ భాగస్వామ్యంతో 18వ ప్రవాసీ భారతీయ దివస్ సదస్సు భువనేశ్వర్‌లో నిర్వహిస్తున్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి విదేశీ భారతీయుల సహకారం అన్న అంశంతో ప్రవాసీ భారతీయ దివస్ సదస్సుని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు 50కి పైగా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు పాల్గొననున్నారు. ఇది ఇలా ఉండగా "ప్రవాస భారతీయ దివస్" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరవుతున్నారు.

--------------------------

వచ్చే నెల నుంచి ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో పర్యటించనున్నానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక ప్రజా ప్రతినిధులతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. వారంలో మూడు రోజుల పాటు ఒక పార్లమెంటు నియోజకవర్గంలో విడిది చేసి, ప్రతీ రోజు రెండు నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలను కలుసుకుంటానని తెలిపారు. మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ పార్టీ బలోపేతం చేయనున్నామని ఆయన తెలుపుతూ,

వాయిస్ ( 29 సెకన్లు)

====================